

# ఎన్నికల ప్రచారంలో ఎంపీ నామ దూకుడు

- కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల కన్నా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ ముందంజ
- నాలుగు రోజుల్లో ఏడు నియోజకవర్గాలను చుట్టేసిన ఎంపీ నామ
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో ముమ్మర ప్రచారం
- బీఆర్ఎస్‌లో ఐక్యతారాగం, నియోజకవర్గ ఇంచార్జీల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రత్యేక సదస్సులు
- బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపుతున్న ముఖ్యనేతలు
- నామ నాగేశ్వరరావు పర్యటనకు కార్యకర్తల నుండి మంచి స్పందన
- గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ ముందడుగు

వనం నాగయ్య, కెరటం న్యూస్

నేను మీ వాడిని, మీ అందరి వాడిని... మీ ప్రోత్సాహంతోనే రెండు సార్లు భారత అత్యున్నత చట్ట సభ పార్లమెంటులో అడుగుపెట్టాను. మరో మారు నన్ను ఆదరించండి అంటూ.. మే నెలలో ప్రతిష్టాత్మకంగా జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు గెలుపే లక్ష్యంగా ఎన్నికల ప్రచారంలో దూసుకు పోతున్నారు. కేవలం నాలుగు రోజుల్లోనే బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఏడు నియోజక వర్గాలను చుట్టేశారంటే ఏ స్థాయిలో ప్రచారం ఆరంభించారో అర్థం చేసుకోవచ్చు. ఖమ్మం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు సారధ్యంలో ఎంపీ నామ గెలుపుకోసం ఎంపీ (రాజ్యసభ) వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, బీఆర్ఎస్ మాజీ శాసనసభ్యులు లావుడ్యా రాములు నాయక్, బానోత్ మదన్‌లాల్, బానోత్ చంద్రావతి, కందాళ ఉపేందర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు,తో పాటు బీఆర్ఎస్ యువజన సంఘం అధ్యక్షులు చింతనిప్పు కృష్ణ చైతన్య, ఏడు నియోజకవర్గాల్లోని జడ్పీటీసీలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, ఇలా అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు అంతా కలిసి ఐక్యంగా నామ గెలుపుకోసం ఎన్నికల ప్రచారంలో ముందడుగు వేస్తున్నారు.

## అన్ని వర్గాల ప్రజలను ఆత్మీయంగా కలుస్తూ...

ఇప్పటికే ఖమ్మం ఎంపీగా రెండు సార్లు అత్యుత్తమ విజయాలను నమోదు చేసుకున్న ఎంపీ నామ నాగేశ్వరరావు తాజాగా వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లోనూ విజయం సాధించాలన్న కసితో ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచారు. తనకు ప్రధాన ప్రత్యర్థులుగా చెప్పుకునే కాంగ్రెస్‌కు ఇంకా అభ్యర్థి ఖరారు కాకపోవడం, బీజేపీ తరపున బరిలో ఉన్న తాండ్ర వినోద్ రావు ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రచారంలో ఉంటున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంచి పట్టున్న నాయకునిగా పేరున్న నామ నాగేశ్వరరావు ఎలాంటి ఆర్భాటాలు లేకుండా నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు.

పాలేరు నియోజకవర్గంలో ఎండిన పంటలతో నష్టపోయిన రైతులను ఓదార్చుతున్న బీఆర్ఎస్ బృందం





## అన్నదాతలకు నామ భరోసా

మార్చి 31న సరిగ్గా వారం రోజుల కిందట ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో పంటలు ఎండిపోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న అన్నదాతలను కలిసి వారికి భరోసా నిస్తూ ఆరంభమైన నామ ప్రచారం ఆ తరువాత కేవలం నాలుగైదు రోజుల్లోనే ఖమ్మం పార్లమెంటు పరిధిలోని సత్తుపల్లి, వైరా, ఖమ్మం, అశ్వారావుపేట, పాలేరు, మధిర, కొత్తగూడెం నియోజకవర్గాలను చుట్టేసింది. వారం రోజుల్లో అన్ని నియోజకవర్గాలను చుట్టేసిన బీఆర్ఎస్ ముఖ్యనేతల బృందం ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లోనూ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించారు. బీఆర్ఎస్ కేడర్‌లో జోష్ నింపుతూ, రాబోవు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని సూచిస్తున్నారు. కాగా శుక్రవారం ఖమ్మం, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల్లో పర్యటించిన నామ సాయంత్రం వేళ ఖమ్మంలోని ముస్లిం సోదరులను కలిసేందుకు ప్రత్యేకంగా జామా మసీదుకు వెళ్లారు. అనంతరం ఖమ్మం నగరంలో అనేక దుకాణాలను, వ్యాపారులను కలుస్తూ వారికి అభివాదం చేస్తూ తనను గెలిపించాలని నామ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇదే క్రమంలో క్రియాశీలక కార్యకర్తలను కలుస్తూ, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, సర్పంచులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మునిసిపల్ చైర్మన్లు, తదితర శ్రేణులతో కలిసి ప్రచారంలో ఉన్నారు.



